

62
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** కొత్త పాటలు, నాట్యాలు, వాయిద్యాల గురించి తెలుసుకోవడానికి ఉత్సాహం చూపుతాడు జాయపుడు. ఓ మహిళ .. జానపదాలను అద్భుతంగా ఆలపిస్తుందని ఎవరో చెప్పాడు. దాంతో ఆమెను వెతుక్కుంటూ.. పల్లె బాట పట్టాడు జాయప. దాదాపు సంధ్య కావస్తుండగా.. ఓ గ్రామానికి దగ్గరగా చేరుకున్నాడు. దారిలో ఎదురైన వ్యక్తి ఇచ్చిన సమాచారంతో.. మరింత ముందుకు సాగాడు. అప్పుడే ఓ ఉచ్ఛస్వరం వినిపించింది. అది వినిపించిన వైపుగా.. దూరంగా ఒక గుడిసె కనిపించింది.

సాంఖియ నివాసం..

అప్పుడే ఓ వ్యక్తి గుడిసె వెనుకనుంచి విసురుగా వచ్చి.. తలుపులాంటి తడికెను వేగంగా ఓ తన్ను తన్నాడు. మరింత చురుగ్గా లోపలికి పోయి ఓ మహిళను జుత్తుపట్టి బయటికి ఈడ్చుకు వచ్చాడు. ఆమె వచ్చి వచ్చి దూరంగా పడింది. వీపుపై ధబీ ధబీమని రెండు తన్నాడు.

ఆమె భరిస్తున్నట్లు.. అలవాటైనట్లు.. అలాగే ఉంది. అతను మళ్లీ కాలెత్తాడు. ఆమె తలెత్తి గట్టిగా..

''అమ్మోరూ దండాలమ్మో.. హయ్యలో దండాలమ్మో!'' అన్నది.

కళ.. ధిక్కారానికి గొంతునిస్తుంది.. ఎప్పుడూ. జాయపుడి చేయి అలవోకగా మీసం మీదికి వెళ్లింది. బహుశా పక్కింటామె కావచ్చు.. అక్కడికి పరిగెత్తుకు వచ్చింది. అతనితో ఏదో వాగ్యుద్ధం.. తను రాకూడని సమయంలో వచ్చానేమోననే శంక జాయపునికి కలిగింది.

తానిప్పుడు ముందుకు వెళ్తే?.. వెళ్లకుంటే??..

ఊహించకుండా అప్పుడే గుర్రాల గుంపు కదలిక వెనగ్గా వినిపించి.. దుమ్ము పైకి లేచింది. జాయపుడు తలతిప్పి చూసేసరికే ఓ మహిళల బృందం గుర్రాలపై వేగంగా వచ్చింది. అక్కడికే వెళ్లి ఆగింది.

ఇంటివద్ద వారు నిర్ఘాంతపోగా ఆవలగా జాయపుడు కూడా సంభ్రమంతో చూస్తుండిపోయాడు.

ఆ మహిళల నాయకురాలు కాబోలు.. వేగంగా గుర్రందిగి విసురుగావెళ్లి ఆ గాయనిని పట్టి లేపింది. ఆమె భర్త సాంఖియ కంచుకం పట్టి అంతే వేగంగా రెండు చెంపలూ వాయించింది. పక్కింటామె ఆనందంగా చూస్తున్నది. ఆగంతక మహిళలు కొందరు ఆమె దగ్గరికి వెళ్లగా.. కొందరు సాంఖియ పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు.

బిలబిలమంటూ కొంతమంది గ్రామస్తులు తలోవైపు నుంచి పరుగున అక్కడికి వచ్చారు.

వారిలో ఓ పెద్దమనిషి.. గ్రామరట్ట కాబోలు ముందుకు వచ్చాడు.

''ఇది రోజూ ఉండే బాగోతమే! తమరెవ్వురమ్మా?'' అని అడిగాడు.

ఆమె ఏమీ చెప్పకుండానే సాంఖియ జుట్టు పట్టుకుంది.

''ఎందుకు ఆమెను కొడుతున్నావ్??'' అని గద్దించింది.

''అది నా పెళ్లాం.. కొట్టుకుంటా.. తిట్టుకుంటా.. నీకెందుకు?'' అన్నాడు సాంఖియ.. అదే క్రౌర్యంతో.

మళ్లీ నాలుగు అంటించింది. ఆమె వెంట వచ్చినవారు అతణ్ని చావబాదారు. అతణ్ని వదిలి.. ఆ జానపద గాయనిని ఒకరు తన గుర్రంపై కూర్చోబెట్టుకున్నారు. గుర్రాలు వెనుదిరిగాయి.

నాయకురాలు అన్నది జనాంతికంగా..

''లచ్చుమ పాటలు పాడటం ఈ మొగుడుగాడికి ఇష్టం లేదట. ఆమె మాకు సమాచారమిచ్చింది. మేం ఆమెను మంచి గాయకురాలిగా చేసి రాజాస్థానంలో పాడేలా శిక్షణ ఇప్పిస్తాం. ఇలా భర్తలు కొట్టి తిట్టే కళాకారులు ఉంటే మాకు తెలియబరచండి!''.

కళ్లెం పట్టి మోకాళ్లతో గుర్రాన్ని సున్నితంగా కదిపింది.

గ్రామస్తులు కూడా తలోమాటా అనుకుంటూ అంతా కదిలారు. జాయపుడు దూరంగానే నిలబడిపోయాడు.

వెళ్తున్న నాయకురాలు జాయపుణ్ని చూసింది. ఆశ్చర్యపోయి గుర్రాన్ని బలంగా ఆపింది. వేగంగా దిగింది.

''అరే.. జాయ మామా! నువ్వా.. నువ్వేమిటి ఇక్కడ??''.

అప్పుడు చూశాడు.

ఆమె నీలాంబ కుమార్తె.. లలితాంబ!!

తెల్లబోయాడు. ఇదేవిటి.. ఈ పల్లెటూరికి ఈ పిల్ల పదిమందిని వెంటేసుకుని వచ్చి ఓ గాయనిని భర్త హింస నుంచి కాపాడి తీసుకుపోతున్నది.. భలే! మరెవరో..